క్లుప్తంగా

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



విద్యార్థులకు ఉపకరణాలందిస్తున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

రావికమతం: మేడివాడ హైస్కూల్‌లోని ఇద్దరు దివ్యాంగ విద్యార్థులకు వీల్ చైర్లు,ముగ్గురు విద్యార్థులకు ఎంఆర్ కిట్లు,ఒకరికి వినికిడి యంత్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ బుధవారం అందజేశారు. అనంతరం ఆమె నాడు నేడు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు తలుపులు,బ్రహ్మాజీ,హెచ్ఎం రామారావు,మండల ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం



వెంకటరావుకు నగదు అందిస్తున్న స్నేహితులు

మాకవరపాలెం: స్నేహితుడి కుటుంబానికి తోటి స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని తామరం గ్రామానికి చెందిన గిడుతూరు వెంకటరావు తండ్రి ఇటీవల మరణించాడు. ఈ నేపథ్యంలో పెద్దకర్మ కోసం మాకవరపాలెం, తామరం గ్రామాలకు చెందిన వెంకటరావు స్నేహితులు బుధవారం రూ. 22,000 నగదు అందజేశారు. వీరికి వెంకటరావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరమణరావు

నాతవరం: పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టినందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షుడు లాలం వెంకటరమణరావు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లువల్ల కలిగేఉపయోగాలను వివరించారు.

వీధి కుక్కల దాడిలో 8 మందికి గాయాలు



వీధి కుక్కల దాడిలో గాయపడిన బాధితులు

చీడికాడ: మండలంలోని శిరిజాంలో వీధి కుక్కల దాడిలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. శిరిజాంలో బుధవారం వీధికుక్కలు గుంపాన నాగేశ్వరరావు, పోతల సూర్యనారాయణ, దిబ్బడి త్రినాథ్, గంపాన దేముడమ్మ, మండల దేముడమ్మతో పాటు మరో ముగ్గురిపై దాడి చేసి గాయపరిచినట్లు సీపీఎం మండల కార్యదర్శి ఆర్.దేముడునాయుడు తెలిపారు. రెండు గేదెలను, ఆవులను కూడా గాయపరిచినట్లు చెప్పారు. గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఆయన తెలిపారు.

ఉపమాకలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

నక్కపల్లి : ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా బుధవారం వేకువ జామున కొండపై కల్కి అవతారంలో స్వయం వ్యక్తమై వెలసిన స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. అనంతరం కొండ దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి వారికి ఆండాళ్లమ్మవారికి స్వామివారి ఉత్సవమూర్తులకు నిత్యార్చనలు పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ బలిహరణలు పూర్తిచేశారు. అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామివారిని పుణ్యకోటి వాహనంలో వేంచేయింపజేసి మాడవీధుల్లో తిరువీధి సేవలు నిర్వహించారు. ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు పీసపాటి శేషాచార్యులు, కృష్ణమాచార్యులు, గోపాలచార్యులు, రాజగోపాలాచార్యులు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్లపై అప్రమత్తం



దేవరాపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి కాంతమ్మ

దేవరాపల్లి: వరి పంటకు తెగుళ్లు సోకే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ అన్నారు. దేవరాపల్లి, కాశీపురం తదితర గ్రామాల్లో బుధవారం ఆమె వరి పొలాలను పరిశీలించారు. మండలంలో 8,280 ఎకరాల్లో వరి సాగు చేశారని, ప్రస్తుతం వరిలో పాసి తెగులు (పాము పొడ తెగులు), అగ్గి తెగులు, ఆకు ముడత తెగుళ్లు సోకినట్లు గుర్తించామన్నారు. పాసి తెగులు సోకిన పంటలో ఆకులు, దుబ్బులు మీద పొడ పాము మచ్చలు మాదిరిగా ఉంటాయని, దీని నివారణకు ఎకరానికి 400 మిల్లీ లీటర్ల ప్రోపికొనజోల్ లేదా అజోక్సిస్ట్రోబిన్ ఎకరానికి 200 మిల్లీ లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి దుబ్బులు తడిసే విధంగా పిచికారీ చేయాలన్నారు. అగ్గి తెగులు సోకిన పంటలో ఆకు మీద గోధుమ రంగు అంచుతో మధ్యలో బూడిద రంగు మచ్చలు ఉంటాయని, దీని నివారణకు ట్రైక్లోజోల్ మందును ఎకరానికి 120 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకుముడత పురుగు సోకిన పంటలో గొంగలిపురుగు ఆకులను మడిచి లోపల ఉన్న పత్రహరితాన్ని గోకి తినడంతో ఆకులు తెల్లగా కనిపిస్తాయన్నారు. దీని నివారణకు క్లోరిపైరిపోస్ మందును ఎకరానికి 500 మిల్లీ లీటర్లు లేదా మోనోక్రోటోపాస్ 320 ఎంఎల్ మందును ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తర్ణాధికారి ఎస్. కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వరినాట్లు

మాడుగుల రూరల్: అల్పపీడన ప్రభావం వల్ల మంగళవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలో చెరువులు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో మెట్ట భూములల్లో జోరుగా వరినాట్లు వేస్తున్నారు. ఈ నెలాఖరుకల్లా వరినాట్లు పూర్తి అవుతాయని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. సాగునీటి చెరువుల్లో నీరు పుష్కలంగా చేరింది. తారకరామ, పెద్దేరు జలాశయాలల్లో నీరు చేరింది. పెద్దేరు జలాశయం పరిసరాలల్లో 48 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

రైతు సంక్షేమానికి సీఎం జగన్ కృషి



సూదివలసలో రైతులకు పట్టాదార్ పాసు పుస్తకాలను అందిస్తున్న అనురాధ, జగన్‌మోహన్

కె.కోటపాడు : రైతుల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని, అన్నదాతలు అన్ని విధాలుగా అభివృద్ధి సాధించేలా పలు పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. సూదివలసలో జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష కార్యక్రమంలో 309 మంది రైతులకు మంజూరైన పాస్ పుస్తకాలను వారు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు మంచి చేస్తున్న సీఎం జగన్‌కు ఎల్లప్పుడూ అండగా నిలవాలని కోరారు.

సూదివలసలో 732 ఎకరాలను సర్వేను చేపట్టినట్టు తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆదిరెడ్డి సన్యాసినాయుడు, ఎంపీటీసీ వర్రి రామునాయుడు, సర్పంచ్లు, ఎంపీటీసీలు వేచలపు దొరబాబు, గొర్రుపోటు వెంకటరావు, చీపురపల్లి అచ్చిబాబు, శ్రీకాంత్ శ్రీను, కిలపర్తి సత్యంనాయుడు, వీఆర్వో గోవిందరావు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో రీసర్వే

మాడుగుల: మండలంలోని సత్యవరం, ఒమ్మలి, చినసారాడ, ఎల్.కృష్ణాపురం గ్రామాల్లో బుధవారం జగనన్న శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా రీసర్వే నిర్వహించారు. సచివాలయ సర్వేయర్లు, వీర్వోలు భూముల సర్వే జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



అగ్ని ప్రమాదాలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

మాడుగుల: మండలంలో సురవరం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు స్థానిక ఫైర్ అధికారులు బుధవారం అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ అధికారి బి.రాజేశ్వరరావు, ఎస్ఎఫ్‌వో ఎస్.రామారావు, సిబ్బంది వర్మ, జి.వరహాలు, జె.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

‘చట్టాలపై అవగాహన పెంచుకోవాలి’



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ రాములమ్మ



హాజరైన విద్యార్థులు

అనకాపల్లిటౌన్: విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అనకాపల్లి దిశ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పి.రాములమ్మ అన్నారు. స్థానిక గవరపాలెం హిమశేఖర్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు కళాశాల ఆవరణలో బుధవారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఉన్నత విలువలు, క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా మంచి మార్గంలో నడుచుకోవాలని హితవుపలికారు. బాల్య వివాహాల అనర్థాలు, ఈవ్ టీజింగ్, పోక్సో, దిశ చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. కొంత మంది విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటుపడి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు సమాజానికి, కుటుంబానికి మంచి పేరు తీసుకువస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దిశ స్టేషన్ హెచ్‌సీ వేదవతి, అధ్యాపకులు పూర్ణ, సురేష్, రమేష్, గోపీకృష్ణ, నాగలక్ష్మి, జగన్, శేషు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత భవిష్యత్తు



మండల స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

అనకాపల్లిటౌన్: విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుని, జాతీయ స్థాయిలో రాణిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడవచ్చని మహాత్మా జ్యోతీరావుపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో పాఠశాలకు చెందిన 46 మంది విజేతలుగా నిలిచారు. వీరిని పాఠశాల ఆవరణలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరంతా త్వరలో జరిగే నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఖోఖో, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, వాలీబాల్, టెన్నీకాయిట్, అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 14 విభాగంలో 27 మంది, అండర్ 17 విభాగంలో 19 మంది విద్యార్థులు నియోజకవర్గ స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో కూడా గెలుపొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావాలని అభిలషించారు.

‘ప్రకృతి’ ఉత్పత్తులకు మార్కెటింగ్ వసతి



తాళ్లపాలెంలో జీవామృతం తయారీని పరిశీలిస్తున్న మార్కెటింగ్ ట్రైనీ అప్పలరాజు



చెరకు పంటను పరిశీలిస్తున్న అప్పలరాజు

కశింకోట: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించనున్నట్లు ప్రకృతి వ్యవసాయ శాఖ మార్కెటింగ్ ట్రైనర్ ఎం.టి.అప్పలరాజు తెలిపారు. మండలంలోని తాళ్లపాలెంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేసే రైతులు, సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రకృతి సాగు రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి వాటి ద్వారా వారు పండించిన ఉత్పత్తులను కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ప్రకృతి వ్యవసాయ సాగు రైతు తమ పొలాల్లో శాశ్వతంగా ఉండేలా సిమెంట్ కుండీలను ఏర్పాటు చేసుకుని, వాటిలో పంట దిగుబడికి దోహదపడే జీవామృతం తయారు చేసుకోవాలని సూచించారు. పంటకు ప్రతి 15 రోజులకు ఒక సారి జీవామృతాన్ని సాగు నీటి ద్వారా అందించాలన్నారు. పంటపై పిచికారీ చేసినా సరిపోతుందన్నారు. జీవామృత వినియోగంతో భూమి సారవంతమై, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వస్తుందన్నారు. ఈ సందర్భంగా జీవామృత తయారీ విధానాన్ని పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న చెరకు పంటను పరిశీలించారు. ఆయన వెంట ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి డి.రమణ, రైతులు కర్రి సత్యనారాయణ, చిన్ని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

22న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడి రాక

నర్సీపట్నం: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఏపీఎస్సీపీసీఆర్) సభ్యుడు గొండు సీతారాం ఈనెల 22న నర్సీపట్నంలో పర్యటించనున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో మేరీ సువార్త తెలిపారు. బాల్య వివాహాలు, బాలల హక్కులపై చర్చించనున్నారని తెలిపారు. పర్యటనలో భాగంగా పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించనున్నట్టు చెప్పారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో బాల్య వివాహాల నిషేధ చట్టం జీవో నంబరు 31పై స్త్రీ, శిశుసంక్షేమ శాఖ అధికారులు, వివిధ ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వార్డు సంరక్షణ, సంక్షేమ కార్యదర్శులు సంబంధిత శాఖ అధికారులతో సమావేశమవుతారని తెలిపారు.

ఎయిడ్స్ పై అవగాహన అవసరం

మాకవరపాలెం: ఎయిడ్స్ వ్యాధిని అవగాహనతో నివారించవచ్చని చైల్డ్ ఫండ్ ఇండియా డీఆర్‌పీ గోవిందరావు అన్నారు. మండలంలోని లచ్చన్నపాలెం సచివాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ వ్యాధిగ్రస్థులపై వివక్ష చూపొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్లు పాల్గొన్నారు.

23న దళిత ప్రతినిధుల గర్జన

మాడుగుల: నర్సీపట్నంలో ఈనెల 23న దళిత ప్రతినిధుల గర్జన జరగనుందని విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు మరువాడ ఈశ్వరరావు తెలిపారు. దళితుల హక్కుల పరిరక్షణకోసం నిర్వహించే గర్జనలో జిల్లాలోని దళిత సంఘాల ప్రతినిధులందరూ పాల్గొనాలని ఆయన కోరారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద గర్జన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యాదగిరి దాసు, చిట్ల చలపతి, ఎం.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రుణ బకాయిలు శతశాతం వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి

రోలుగుంట: వెలుగు ద్వారా మంజూరు చేసిన రుణాల బకాయిలను శతశాతం వసూలు చేయాలని డీఆర్‌డీఏ పీడీ బి.లక్ష్మీపతి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్త్రీనిధి, ఉన్నతి తదితర పథకాల ద్వారా ఇచ్చిన రుణాల బకాయిల వసూలు గురించి అడిగి తెలుసుకున్నారు. మొండి బకాయిలపై ఆరా తీశారు. వచ్చేనెల 15వ తేదీ లోగా బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు 950 రోజులుగా పోరాటం

అచ్యుతాపురం (అనకాపల్లి): విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ, గొర్లె ధర్మవరం, లంక ధర్మవరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ 950 రోజులుగా స్టీల్‌ప్లాంట్ రక్షణకు పోరాటం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్న బైక్ యాత్ర ఈ నెల 27న అచ్యుతాపురం చేరుకుంటుందని, దీనిలో పాల్గొని ప్రజలంతా సంఘీభావం తెలపాలని కోరారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాపూజీ, కొండబాబు, బాబు, శ్రీను పాల్గొన్నారు.

నదుల్లో పెరిగిన నీరు



కొత్తూరు వద్ద మేజర్ శారద నదిలో నీరు

రాంబిల్లి: మేజర్, మైనర్ శారద నదుల్లో బుధవారం నీరు పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా పడుతుండటంతో నదుల్లో నీరు చేరుతోంది. నదుల్లో నీరు పెరగడంతో పంట కాలువల్లో నీరు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తుంది. దీంతో తమకు సాగునీటి ఇబ్బందులు తప్పుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతులు వరినాట్లులో కలుపు తీత పనుల్లో నిమగ్నమయ్యారు. కలుపుతీత పనులు పూర్తి చేసిన రైతులు ఎరువులు , క్రిమి సంహారక మందులు పిచికారి పనులు చేస్తున్నారు.

ఘనంగా నవరాత్రి పూజలు



ఎం.కోడూరులో ఫైర్ బాయ్స్ ఆధ్వర్యంలో వినాయకుని వద్ద పూజలు చేస్తున్న సర్పంచ్ తదితర్లు



రోలుగుంటలో అన్న సమారాధన నిర్వహిస్తున్న రాక్‌స్టార్ యూత్ సభ్యులు



ప్రత్యేక అలంకరణలో ఎం. కోడూరులో వినాయక విగ్రహం

మాడుగుల రూరల్:గణపతి నవరాత్రి ఉత్సవాలను గ్రామాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎం.కోడూరు సతకంపట్టు వద్ద 12 అడుగుల ఎత్తు కలిగిన భారీ వినాయక విగ్రహాన్ని స్థానిక ఫైర్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎం.కోడూరు శివాలయంలోని ఉపఆలయంలో గల సిద్ధి వినాయకునికి స్థానిక సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ప్రభావతి దంపతులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కేజే పురం చెరకు కాటా ఆవరణలో ఏర్పాటుచేసిన సిద్ధి వినాయకుని మండపం వద్ద భారీగా అన్నసమారాధన నిర్వహించారు. వినాయక యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

రోలుగుంట: స్థానిక పాత రామమందిరం వద్ద గల కల్యాణమండపంలో వినాయక చవితి ఉత్సవాలను రాక్‌స్టార్‌యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం భారీ అన్న సమారాధన జరిపారు.

అట్రాసిటీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలి



నినాదాలు చేస్తున్న దళిత సంఘాల నేతలు

రావికమతం: అట్రాసిటీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని పలు దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కొత్తకోటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ సేవా సంఘాల సభ్యులు బుధవారం సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో దళిత సేవా పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి దాసు, డీకేఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు చిట్ల చలపతి, నర్సీపట్నం డివిజన్ నాయకుడు మూర్తి అప్పలరాజు మాట్లాడారు. అట్రాసిటీ కేసుల్లో అధికారుల తీరు ఆక్షేపణీయంగా ఉందన్నారు. చట్టాలను నీరుకార్చే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.దీనిపై ఈ నెల 23న నర్సీపట్నంలో ఐక్య సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక దళిత నేతలు బుంగా బుల్లిబాబు,పూడి అప్పారావు, యూత్ సభ్యులు శివ, మోసే పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సర్వే



ఎ.కోడూరులో ఆరోగ్య సర్వేలో బీపీ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందనున్నట్టు లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ తెలిపారు. ఎ.కోడూరులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సర్వే జరిపారు. ఈ సందర్భంగా గ్రామంలో గల 1,050 కుటుంబాల్లోని ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను తెలుసుకోనున్నట్టు సన్యాసిరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎ.కోడూరు ఎంపీటీసీ లెక్కల గౌతమి, సచివాలయ కన్వీనర్ బొడ్డు ప్రకాసమ్మ, బొడ్డు శ్రీను, లెక్కల శంకరరావు, పీహెచ్ఎన్ ప్రమీలా తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం



మాట్లాడుతున్న ఎంఈవో తాడి అమృత్‌కుమార్

నాతవరం: పాఠశాలల్లో నిర్వహిస్తున్న రెండో విడత నాడు నేడు పనులను వేగవంతం చేయాలని ఎంఈవో తాడి అమృత్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరు ఆదేశాల మేరకు నవంబరు నెలాఖరులోగా పనులు పూర్తి చేసే బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని తెలిపారు. ప్రభుత్వం కొత్తగా విధించిన నిబంధనల ప్రకారం పాఠశాలల్లో బోధన జరగాలన్నారు. మధ్యాహ్నన భోజన పథకం మెనూ అమలులో నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు. నిర్ణీత సమయం ప్రకారం విద్యా కమిటీ సమావేశం నిర్వహించి తల్లిదండ్రుల సూచనల మేరకే పాఠశాలలను అభివృద్ధి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో రెండవ ఏంఈవో కామిరెడ్డి వరహాలబాబు, సీఆర్పీలు పోలుపర్తి నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి, గోవిందు, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మోహన్‌రావు తదితరులు

మాకవరపాలెం: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న జరిగే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని అవంతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు కోరారు. ఈ జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం తమ కళాశాలలో జరగనున్న జాబ్‌మేళాలో జాతీయ, అంతర్జాతీయ సంస్థలైన మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, రెడ్డీస్ లేబొరేటరీ, అరబిందో ఫార్మా వంటి 15 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. 18-40ఏళ్ల మధ్య వయస్సు గల, పది, ఇంటర్, ఏదైనా డిగ్రీ, డిప్లమో, ఐటీఐ బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన యువతీ యువకులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు 949190858,9705474968, 9014765287అనేనంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

హెచ్ఎంల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానకార్యదర్శి రవీంద్రబాబు

నర్సీపట్నం: ప్రధానోపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏవీహెచ్ శాస్త్రి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ మెయిన్ పాఠశాలలో ఏపీ హెచ్ఎంల సంఘం నర్సీపట్నం క్లస్టర్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో శాస్త్రి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు పాఠశాలల గ్రాంట్స్ విడుదల, కరెంటు బిల్లులు, ఎంఈవో-2ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎం.జె.రవీంద్రబాబు, గౌరవ అధ్యక్షులు సాయిబాబా పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్

మాడుగుల రూరల్: మండలంలోని రెండు గ్రామాల్లో బుధవారం ఫ్యామిలీడాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. కేజే పురం పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ బి.రవితేజ ఆధ్వర్యంలో శంకరం, శివారు గ్రామమైన చంద్రపురంలలో 90 మంది రోగులకు, అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సహాయకులు కిల్లో నీలాంబరం, ఏఎన్ఎం రాణి తదితరులు పాల్గొన్నారు.